


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | బుధవారం | 02-09-2026 | సంపుటి : 3 | సంచిక: 210 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 02-09-2026 | VOLUME : 3 | ISSUE : 210 | PAGES: 8 | COST: 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- అనవసరంగా బంగారాన్ని కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమష్టి కృషితోనే జీడీపీ వృద్ధి రేటు
- ఇన్‌స్టా వేదికగా ప్రజలకు ప్రధాని మోదీ అభినందనలు

4




## క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

- క్రిటికల్ మినరల్స్ పరిశోధనకు త్రిముఖ భాగస్వామ్యం
- మోనాష్-ఐఐటీ హైదరాబాద్-సింగరేణి సంయుక్తంగా ముందడుగు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# అంతుచిక్కని కాంగ్రెస్ పార్టీ పరిణామాలు

- హస్తినలో రేవంత్–వేణుగోపాల్ భేటీ
- కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై చర్చ
- నామినేటెడ్ పదవుల భర్తీపై కసరత్తు
- కేబినెట్ విస్తరణపైనా ఆసక్తికరచర్చలు
- రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ మంత్రాంగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:**

తెలంగాణ కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు అంతుచిక్కని రాజకీయానికి దారితీస్తున్నాయి. ఓవైపు కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై పార్టీ క్రమశిక్షణా కమిటీ నివేదికలు, మరోవైపు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానం కసరత్తు నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయం హస్తినకు చేరింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

**రాష్ట్ర రాజకీయాలపై చర్చ**

కేసీ వేణుగోపాల్‌తో సమావేశంలో తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ వ్యవహారాలు, నామినేటెడ్ పదవుల భర్తీ, పార్టీ బలోపేతం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంపైనా ఇరువురు నేతలు మాట్లాడినట్లు తెలుస్తోంది.

**కొండా సురేఖ వ్యవహారం**

మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో నెలకొన్న వివాదం, దానిపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక

మిగతా 2వ పేజీలో..

'ఫీజు' బకాయిలు తక్షణం

## విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గత రెండున్నరేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ,

మిగతా 2వ పేజీలో..



## గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలి

- రాష్ట్రంలో అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్
- పర్యావరణహిత వేడుకలకు ప్రాధాన్యం
- రక్షణ, పారిశుద్ధ్యం, వైద్యసేవలు నిరంతరం అందుబాటులో వుండాలి
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

3

## ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాం

- వెయ్యి రోజుల పాలనపై రవాణా శాఖ మంత్రి పొన్నం

3

## యధావిధిగా కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్

- సింగిల్ బెంచ్ తీర్పుపై హైకోర్టు స్టే



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణలో వర్షాల లోటు

- మూడు నెలల్లో 20 శాతం తక్కువ వర్షపాతం
- ఆగస్టులో ఏకంగా 42 శాతం లోటు

2

## మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల
- లబ్ధిదారులకు మహిళా యోజన చెక్కుల పంపిణీ



2



2

## కాంగ్రెస్ దాడి సంస్కృతిపై 'సడక్ సే సదన్ తక్' పోరు

- రాంచందర్ రావుతో నితిన్ నబీన్ ఫోన్ సంభాషణ



2

## 'శుద్ధీకరణ' పేరిట దళిత ఆత్మగౌరవంపై దాడి

- ఉత్తరాఖండ్ ఘటనపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం

## నర్సు శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

- బాధిత కుటుంబానికి మంత్రి సీతక్క పరామర్శ



**కొత్తగూడెం, సెప్టెంబర్ 1:**

తుక్కుగూడలో దారుణ హత్యాచారానికి గురైన నర్సు ఉకే శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ

మిగతా 2వ పేజీలో..

## యాదాద్రి పవర్ స్టేషన్‌కు నైనీ బొగ్గు తొలి రేక్

3



## అంతుచిక్కని కాంగ్రెస్
# పార్టీ పరిణామాలు

మొదటిపేజీ తరువాయి

అంశాలు భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. సురేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై అధిష్ఠానం స్థాయిలో కసరత్తు కొనసాగుతున్నట్లు సమాచారం. సురేఖకు కూడా కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ లభించినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

**చిన్నారెడ్డి అంశంపైనా**

పార్టీ సీనియర్ నేత, ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారం కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనపై వచ్చిన ఆరోపణలు, పార్టీకి ఇబ్బందికరంగా మారిన పరిణామాల నేపథ్యంలో క్రమశిక్షణా చర్యలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సురేఖతో పాటు చిన్నారెడ్డి విషయంలోనూ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

**రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ మంత్రాంగం**

ఇదే సమయంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఢిల్లీకి చేరుకోవడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తనకు అవకాశం కల్పించాలని అధిష్ఠాన పెద్దలను కోరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే పలువురు ఆశావహులు అధిష్ఠానం పెద్దలను కలిసేందుకు ఢిల్లీ బాట పట్టినట్లు సమాచారం.

**తదుపరి నిర్ణయాలపై ఉత్కంఠ**

ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, కొండా సురేఖ, రాజగోపాల్ రెడ్డి సహా పలువురు కీలక నేతలు ఢిల్లీలో ఉండటం తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులపై ఊహాగానాలకు తెరతీసింది. సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలతో పాటు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలపైనే ఇప్పుడు పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# తెలంగాణలో వర్షాల లోటు

- మూడు నెలల్లో 20 శాతం తక్కువ వర్షపాతం
- ఆగస్టులో ఏకంగా 42 శాతం లోటు
- 19 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సెప్టెంబర్‌పైనే రైతుల ఆశలు
- ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం



హైదరాబాద్, సెప్టెంబర్ 1:

తెలంగాణలో ఈ ఏడాది వర్షాకాలం ఆశించిన స్థాయిలో సాగడం లేదు. జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సాధారణంగా 581 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 462 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో సుమారు 20 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వర్షాల కొరతతో సాగు, తాగునీరు, భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఆగస్టులో భారీ లోటు**

నెలల వారీగా చూస్తే జూన్‌లో సాధారణం కంటే 8 శాతం, జూలైలో 10 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఆగస్టులో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఆ నెలలో ఏకంగా 42 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**19 జిల్లాల్లో లోటు**

రాష్ట్రంలోని జిల్లాల వారీ పరిస్థితిని పరిశీలిస్తే 13 జిల్లాల్లో మాత్రమే సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. మరో 19 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కామారెడ్డి జిల్లాలో మాత్రం సాధారణం కంటే 25 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో వర్షాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.

**సెప్టెంబర్‌పైనే ఆశలు**

వర్షాకాలంలో చివరి నెల అయిన సెప్టెంబర్‌పైనే రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని వాతావరణ అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 శాతం వరకు వర్షపాతం లోటు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఎండల ప్రభావం కూడా**

మరోవైపు వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా సెప్టెంబర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా. దీంతో సెప్టెంబర్‌లోనూ ఎండ తీవ్రత కొనసాగే పరిస్థితులు కనిపించవచ్చని పేర్కొంటున్నారు.

**వాతావరణ వ్యవస్థలపైనే ఆధారం**

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటడం, ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం కావడం వంటి పరిణామాలు వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా ఇతర వాతావరణ వ్యవస్థలు ఏర్పడితే తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సెప్టెంబర్‌లో వర్షాల పరిస్థితి రానున్న రోజుల్లో ఏర్పడే వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు.

## ‘ఫీజు’ బకాయిలు తక్షణం
# విడుదల చేయాలి

మొదటిపేజీ తరువాయి

పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ప్రస్తుతం 650కి పడిపోయిందని, ఇప్పటికే సుమారు 310 కళాశాలలు మూతపడ్డాయని తెలిపారు. అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బందికి 5 నుంచి 10 నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమను కలిసి వినతిపత్రం అందజేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు, కరోనా కష్టకాలంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదని, తొమ్మిదిన్నరేళ్లలో రూ.19,500 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు.

**అసెంబ్లీని స్తంభింపజేస్తాం**

ఎలక్షన్ మేనిఫెస్టోలో పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని చెప్పి మూడు బడ్జెట్లు మారినా ఇప్పటికీ దాదాపు రూ.10,000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ప్రతీ విద్యాసంవత్సరం నిర్ణీత గడువులోగా నిధులు విడుదల చేసేలా శాశ్వత విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తామని హరీష్‌రావు హెచ్చరించారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 :



క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండకూడదని, మొత్తం విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ భాగస్వామ్యానికి సంబంధించిన కార్యాచరణను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి వేదికగా మలచాలని చెప్పారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం చేయడం ద్వారా ఖనిజాల అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే విధానాలపై దృష్టిపెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, మోనాష్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ యాయిన్నిస్ వెంటికోస్, ఆస్ట్రేలియాఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ మోహన్ ఎల్లిషెట్టి, ప్రొఫెసర్ రామన్ సింగ్, సింగరేణి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ దాడి సంస్కృతిపై ‘సడక్ సే సదన్ తక్’ పోరు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 :

తెలంగాణలో బీజేపీ నేతలు, కార్యాలయాలపై జరుగుతున్న దాడుల ఘటనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆయన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగడుతున్నందుకే ఓర్వలేక పార్టీపై దాడులకు తెగబడుతున్నారని రామచందర్ రావు వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంతోపాటు నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడుల వివరాలను నబీన్‌కు తెలియజేశారు. బాధితుడు వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తుంటే తనను హౌజ్ అరెస్ట్ చేసి అనంతరం గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన తీరును వివరించారు. ఘటనల వివరాలు తెలుసుకున్న నితిన్ నబీన్రాష్ట్రంలో బీజేపీ శ్రేణుల ధైర్యాన్ని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న రాష్ట్ర నాయకత్వానికి, కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ దాడులకు భయపడేది లేదని, ‘సడక్ సే సదన్ తక్’ (రోడ్డు నుండి అసెంబ్లీ వరకు) పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, దాడికి గురైన నాగం వర్షిత్ రెడ్డితో కూడా నబీన్ త్వరలోనే ఫోన్ ద్వారా మాట్లాడి పరామర్శించనున్నారు.

## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

మొదటిపేజీ తరువాయి

2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాక పథకం లబ్దిదారు కూడా కాదని అన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమని చెప్పారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందని అన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# నర్సు శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

మొదటిపేజీ తరువాయి



(సీతక్క) హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి వెళ్లిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయితో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష**

ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్వయంగా వచ్చినట్లు మంత్రి సీతక్క తెలిపారు. నిందితుడిని పోలీసులు వేగంగా అరెస్టు చేశారని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద ఆదివాసీ కుటుంబానికి చెందిన శిరీష నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న సమయంలో ఇలాంటి దారుణం జరగడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆర్థిక సాయం, పునరావాస హామీలు**

బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా రూ.5 లక్షల చెక్కుతోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి రూ.లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక తాను, ఎమ్మెల్యే ఆదినారాయణ కలిసి వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశామన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద పరిహారంతోపాటు ఇందిరమ్మ ఇల్లు, సాగుభూమి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నగరాలకు వచ్చే గ్రామీణ, ఆదివాసీ యువతుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని, అత్యవసర సాయం కోసం ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటునూ పరిశీలిస్తామని వెల్లడించారు.

## ‘శుద్ధీకరణ’ పేరిట దళిత
# ఆత్మగౌరవంపై దాడి

హైదరాబాద్, సెప్టెంబర్ 1:

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడం కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన ఘోర దాడి అని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఖర్గే ప్రసంగించిన వేదికపై శ్రీరామ్ సేన సభ్యులు ‘శుద్ధీకరణ’ నిర్వహించడాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఉత్తమ్ మండిపడ్డారు. తప్పు చేసిన వారిని పక్కన పెట్టి సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది కాంగ్రెస్‌బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగ సమానత్వానికి, సామాజిక వివక్షకు మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంగ్రామమని మంత్రి అభివర్ణించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రతిపక్షాలను భయపెట్టేందుకు వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా వాడుతున్నారని ఆరోపించారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. వేదికలను కాదు, సమాజంలో ఇంకా మిగిలి ఉన్న వివక్షాపూరిత మనస్తత్వాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



# మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల
- లబ్దిదారులకు మహిళా యోజన చెక్కుల పంపిణీ

మేడ్చల్, సెప్టెంబర్ 1 :

మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడేందుకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా పొందే ఆర్థిక సహాయం ఎంతగానో దోహదపడుతుందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే ముఖ్యమంత్రి ఆలోచనే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన అని తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగగలరన్నారు. ఈ పథకం కింద మేడ్చల్ జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళా లబ్దిదారులు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అందించారు. తుర్క కాశి ముస్లిం వర్గానికి కుల వృత్తికి ఉపయోగపడే రూ.60 వేల విలువ చేసే జనరేటర్ టూల్ కిట్‌లను 57మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. రేవంత్ అన్నాకా సహారామిస్కినో కేలియే పథకం కింద మైనారిటీల జీవనోపాధికి అవసరమైన రూ.లక్ష విలువైన మోపెడ్‌లను, స్వయం ఉపాది కింద మహిళలకు కుట్టు మిషన్ లు అందజేశారు. మత, సామాజిక, మౌలిక సదుపాయాల కోసం ఆర్థిక సహాయం, విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించడానికి ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నదని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిష్ఠాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసి అందరికీ సన్న బియ్యం అందచేస్తున్నదన్నారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా నైపుణ్యం అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. అనంతరం లబ్దిదారులకు చెక్కుల పంపిణీ, జనరేటర్ అండ్ టూల్ కిట్ అందచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టియే సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్స్, టీజీఎల్‌డీఏ ఛైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిలు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాం

- కారుణ్య నియామకాలు జరిపాం
- వాహన్ సారథి తీసుకొచ్చాం
- వెయ్యి రోజుల పాలనపై రవాణా శాఖ మంత్రి పొన్నం

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టామని, తమ ప్రభుత్వం వచ్చిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించామని, ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయగా వారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంతోపాటు సంస్థ ప్రగతిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా బస్ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ, రవాణా శాఖ విజయాలు, ప్రగతి గురించి వివరించారు. దేశంలో మొదటిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులను చేశామన్నారు. ప్రతి బస్సుకు రూ.69,468లు, నెలకు రూ.4 కోట్లు ఈఎంఐ చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు రూ.29.31 కోట్లు చెల్లించామని చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ 67 శాతం ఉంటే ఇప్పుడు 89 శాతం పెరిగిందన్నారు.

**ఈవీ బస్సులు, నియామకాలు**

సర్వీసు నుండి తొలగింపునకు గురైన దాదాపు 244మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నామని, 1,424 కారుణ్య నియామకాలు చేపట్టామని చెప్పారు. 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, పీఎం డ్రైవ్ కింద హైదరాబాద్‌లో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కబోతున్నాయని చెప్పారు. ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ వరకు కనెక్టివిటీ అమలు చేస్తామన్నారు. ఎలక్ట్రానిక్ టిమ్‌ల ద్వారా టికెట్ జారీ చేస్తున్నామన్నారు. తార్నాక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి చేశామని, ఆర్టీసీ శ్రామికులకు రెండు పీఆర్సీలు ఇచ్చామని, 5 డీఏలు ఇచ్చామని, డీఏలు పెండింగ్‌లో లేవని వివరించారు. యూనియన్ ఎన్నికలు జరుపుతున్నామని, తరువాత విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. బస్ స్టేషన్‌లను ఆధునికీకరిస్తున్నామని, పెద్దపల్లి, ఏటూరునాగారం డిపోలు ఇచ్చామని, సీసీఎస్ బకాయిలు రూ.1096 కోట్ల నుండి రూ.939 కోట్లకు తగ్గించామని, పీఎఫ్ బకాయిలు రూ.2108 కోట్ల నుండి రూ.1710 కోట్లకు తగ్గించామని, ఎసఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు రూ.513 కోట్ల నుండి రూ.485 కోట్లకు తగ్గించినట్లు వివరించారు. 4,538 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, వెయ్యి డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామకాలు పూర్తయ్యాయని, వచ్చే నెలలో నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. 1500 కండక్టర్ నియామకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఎక్కడా పొరపాటు జరగకుండా పారదర్శకంగా పోలీస్ శాఖ ద్వారా నియామకాలు చేపట్టామని చెప్పారు. 240 డీజిల్ బస్సులు రిటైర్‌ఫిట్మెంట్ చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలకు బస్ స్టేషన్లు ఆధునికీకరిస్తున్నామని, భక్తుల రద్దీకి తగ్గట్టు బస్సులు నడుపుతామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కొత్త రూట్లు అడిగితే బస్సులు వేస్తున్నామని, హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో నడిపిస్తున్నామని, గ్రామాల్లో కూడా బస్ రూట్లు లేని ప్రాంతాల్లో బస్సులు నడిపిస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు. దేశంలో నంబర్ 1గా ఆర్టీసీ ఎదుగుతుందన్నారు. ప్రతి నెలా మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, వారి సమస్యలు పరిష్కరిస్తున్నామని, రోడ్ సేఫ్టీ సెస్ రోడ్డు భద్రతకు ఉపయోగించుకునేలా చట్టం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు. నగరంలో కొన్ని రూట్లలో నైట్ బస్సులు నడుస్తున్నాయని మంత్రి పొన్నం చెప్పారు.



**ఈవీ పాలసీ**

హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తెచ్చామని, రూ.1400 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చామని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో ఆటోలను రిటైర్‌ఫిట్మెంట్ చేయడానికి ప్రభుత్వం రూ.1.50 లక్షలు సహాయం అందిస్తుందన్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టులు ఎత్తివేసిందని, జిల్లాలో ఎన్‌ఫోర్సుమెంట్ టీంలు పెంచామని, టీఎస్‌ను టీజీగా మార్చుకున్నామని చెప్పారు. వాహన అండ్ సారథి తీసుకొచ్చామని, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనలతో వాహన సారథిలో చేరామన్నారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టులు ప్రారంభిస్తున్నామన్నారు. రవాణా శాఖలో 113 ఏఎంవీఐలు, 50 మంది కానిస్టేబుల్, 20 మంది జూనియర్ అసిస్టెంట్, నలుగురు ఎంవీఐలను నియమించామని, రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అరైవ్ అలైవ్ పేరుతో పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని, రహవీర్ స్కీమ్ అమలు చేస్తున్నామని వివరించారు.

## యాదాద్రి పవర్ స్టేషన్‌కు
# నైనీ బొగ్గు తొలి రేక్

**దామరచర్ల, సెప్టెంబర్ 1:**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) విద్యుత్ ఉత్పత్తి దిశగా ఒక కీలక మైలురాయిని అధిగమించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలో నడుస్తున్న ఒడిశాలోని నైనీ గని నుండి సేకరించిన అత్యంత నాణ్యమైన 4,000 టన్నుల బొగ్గుతో కూడిన మొదటి రైల్వే రేక్ మంగళవారం ప్లాంట్‌కు చేరుకుంది. ఈ తొలి బొగ్గు రేక్‌కు టీజీజెన్‌కో డైరెక్టర్లు బి.నాగ్య (బొగ్గు & లాజిస్టిక్స్), వై.రాజశేఖర్ రెడ్డి (థర్మల్ & ప్రాజెక్ట్స్) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ నుండి సుమారు 1,050 కిలోమీటర్ల దూరం రవాణా అయిన ఈ అధిక నాణ్యత గల బొగ్గు వల్ల బాయిలర్ల పనితీరు మెరుగవడమే కాక బూడిద సమస్యలు తగ్గి ప్లాంట్ గరిష్ట సామర్థ్యంతో పనిచేసేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవతో టీజీజెన్‌కో, సింగరేణి, రైల్వేల సమన్వయంతో ఈ సుదూర రవాణా ప్రక్రియ సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరగడం వల్ల రాష్ట్రానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని స్పష్టం చేశారు.

## ఎంపీ ల్యాడ్స్ నిధులపై
# దుష్ప్రచారం తగదు

- ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు
- ఎంపవర్డ్' సంస్థ నివేదికపై కేంద్ర మంత్రి బండి

**కరీంనగర్, సెప్టెంబర్ 1 :**



ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై ఆయన స్పందించారు. కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంటు సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని అన్నారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా అభాండాలు వేయడం సరికాదన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని సంజ□YT స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో వి□డియాకు వివరించారు. 'కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించి గత మ□డేళ్లలో కమ□్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం.. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి.. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా కలెక్టర్లు ఆమోదం తెలిపారు.. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది.. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు తెలిపారు. వాస్తవానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదంటూ ఆ నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ 'ఎంపవర్డ' సంస్థ ప్రచారం చేయడం అన్యాయమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో ఏడు నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఆ నిధులు మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ సంబంధిత కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాల న్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని వాటిని ప్రజల ముందుంచాలని సంజయ్ కోరారు.

# గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తామని రవాణా బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. వచ్చే గణేష్ నవరాత్రి ఉత్సవాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఘనంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో గణేష్ ఉత్సవ వేడుకలు2026 ఉన్నతస్థాయి సన్నాహక సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని, మండపాల నిర్వాహకులు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకుని ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో సుమారు 47 సంవత్సరాలుగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాల సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని గత అనుభవాల్లో ఎదురైన సమస్యలు, లోపాలను ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఉత్సవాలు, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. షీ టీమ్స్, యాంటీథెఫ్ట్ నిఘా బృందాలను వినియోగించడంతోపాటు శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపులు, ట్రాఫిక్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖలు 24 గంటలపాటు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, వీధి దీపాలను సక్రమంగా నిర్వహించాలని, బేబీ పాండ్ల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఫాగింగ్, బయో టాయిలెట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన మున్సిపల్ కార్పొరేషన్ల లోగోలను విస్తృతంగా ప్రదర్శించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కీలక ప్రాంతాల్లో 24 గంటల వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతోపాటు ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, అంబులెన్సులు, షిఫ్ట్‌ల వారీగా వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మౌలిక వసతులను ముందస్తుగా తనిఖీ చేసి విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుని, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

రవాణా శాఖ, టీజీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న బస్సులను మాత్రమే వినియోగించాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా దాదాపు 700 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని అవసరమైన మార్గ మళ్లింపులు చేపట్టాలని, మొబైల్ బ్రేక్‌డౌన్ రిలీఫ్ వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో రైల్ సేవలను అవసరానికి అనుగుణంగా పొడిగించాలని, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలని, ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించాలని, స్టేషన్లలో స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు నిమజ్జన ప్రాంతాల్లో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాల్లో లైఫ్‌బోట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ బేబీ పాండ్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నాణ్యతను, ఇతర అవసరమైన ఏర్పాట్లను నిర్ధారించాలని ఆదేశించారు. ఎండోమెంట్స్, సాంస్కృతిక, సమాచార పౌర సంబంధాల శాఖలు మట్టి విగ్రహాలు, గణేష్ ఉత్సవాల ప్రచురణలు చేపట్టి ప్రజలలో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సాంస్కృతిక బృందాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని, ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని మంత్రి సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు డీజేల వినియోగంపై ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, శాంతిభద్రతలు, ప్రజా భద్రత, మత సామరస్యాన్ని కాపాడేందుకు అధికారులు, నిర్వాహకులకు పరస్పర సహకారం అలాగే అందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన సమన్వయం, సకాలంలో సమస్యల పరిష్కారంతో గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించా రు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, రఘువీర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి; డీజీపీ సీవీ ఆనంద్, ఏడీజీపీ మహేష్ భగవత్, పోలీస్ కమిషనర్లు సజ్జనార్, రమేష్, సుమతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్లు కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి; హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంతరావు, ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టూరిజం ఎండీ గౌతమి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ జాయింట్ ఎండీ మయాంక్ మిట్టల్, సాంస్కృతిక శాఖ సంచాలకులు నరసింహారెడ్డి, ఐ&పీఆర్ అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటరమణ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి కార్యదర్శి శశిధర్ రెడ్డి, సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతల అరెస్టులు
# అప్రజాస్వామికం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:**



కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామిక, నియంతృత్వ పాలన సాగిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నల్లగొండలో దాడికి గురైన బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు మరియు ఇతర సీనియర్ నాయకులను హౌజ్ అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న బీజేపీని చూసి భయపడుతోందని కిషన్ రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడి నివాసంపైనా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపైనా దాడులు చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోకుండా బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఎంతమందిని అరెస్ట్ చేసినా ప్రజల సమస్యలపై, బాధితుల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగుతుందని, కాంగ్రెస్ అహంకార పూరిత వైఖరికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా వంచనే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్ర ధ్వజం

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకున్న వెయ్యి రోజుల పాలన ప్రజా పాలన కాదని, అది ముమ్మాటికీ ప్రజా వంచన పాలన అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడుల నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు వెళ్తుంటే మంగళవారం హౌజ్ అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను, గ్యారెంటీలను విస్మరించి రాష్ట్ర ప్రజలను దయనీయ స్థితిలోకి నెట్టారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఈ రోజుల వెయ్యి పాలన ప్రజలకు ఏమి ఇచ్చిందో పరిశీలిస్తే నేడు తెలంగాణ అత్యంత ఆందోళనకరమైన, దయనీయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది అన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు, గ్యారెంటీలలో ఇప్పటివరకు అమలైనవి ఎన్ని.. నెరవేర్చిన హామీలు ఏవి అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**రైతులు, నిరుద్యోగులకు ద్రోహం**


రుణమాఫీకి ₹40,000 కోట్లు అవసరమైతే కేవలం ₹18,000 కోట్లతో చేతులు దులుపుకున్నారని, రైతు భరోసాను ₹15,000 నుంచి ₹12,000 కు తగ్గించి బకాయిలు పెట్టారని మండిపడ్డారు. కౌలు రైతుల సమస్యలు పట్టించుకోలేదని, ₹500 ధాన్యం బోనస్ హామీ అమల్లోకి రాలేదని పేర్కొన్నారు. మొదటి 100 రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,000 ఉద్యోగాలతో యువతను మోసం చేశారని రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యోగులు, విద్యార్థుల రోదన**

ఉచిత స్కూటర్లు, మహిళలకు ₹2,500 సాయం, పసిడి హామీలు ఎటు పోయాయని ప్రశ్నించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పెన్షన్లు ఇవ్వకపోగా, పీఆర్సీ అమలును నిర్లక్ష్యం చేశారన్నారు. సుమారు ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**డిక్లరేషన్ల పేరుతో మోసం**

బీసీ సంక్షేమం అన్నారు, ఎస్సీ డిక్లరేషన్ అన్నారు, రైతు డిక్లరేషన్ అన్నారు.. సమాజంలోని అన్ని వర్గాలకు కొండంత ఆశలు చూపించారు. ఆ డిక్లరేషన్లు, కమిట్‌మెంట్లు ఇప్పుడు ఎక్కడికి పోయాయని నిలదీశారు.



ఈ 1,000 రోజుల్లో ప్రజలకు మీరు చెప్పింది 1,000 అబద్ధాలు మాత్రమే. ఇది ప్రజా పాలనః కాదు.. ముమ్మాటికీ ప్రజా వంచన పాలన అని అన్నారు.

**హైదరాబాద్‌పై కొత్త భారాలు – శాంతిభద్రతలు కుదేలు**

నగర ప్రజలను భయాందోళనలకు గురిచేయడానికి హైడ్రా, అనిశ్చితికి హిల్ట్, కొత్త పన్నుల వసూళ్లకు క్యూర్ తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఎమర్జెన్సీ వాతావరణాన్ని గుర్తు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే నాణేనికి రెండు ముఖాలని అభివర్ణించిన ఆయన తమపై అక్రమ కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా, అరెస్టులు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ దాడుల సంస్కృతికి భిన్నంగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని, ప్రజలను ఏకం చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ నిరంతరం పోరాటం సాగిస్తుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు.

# కొత్తగూడెం విమానాశ్రయంపై కీలక ముందడుగు

- 7న రానున్న కేంద్ర సాంకేతిక బృందం

**న్యూఢిల్లీ:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన 4 నుంచి 5 ప్రత్యామ్నాయ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం ఈనెల 7న పర్యటించనుంది. ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మంగళవారం భేటీ అయిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వివరాలను వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేకపోవడంతో కొత్తగా మరికొన్ని స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, విమానాశ్రయ నిర్మాణ సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం పరిశీలించనుంది. సాంకేతిక నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. భద్రాచలం రామాలయ విశిష్టతను, జిల్లా ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించిన కేంద్ర మంత్రికి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. అలాగే, వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# జీడీపీ వృద్ధి రేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే వృద్ధి ఎలా సాధ్యం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**



దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతోందని ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజి' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని రమేష్ ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కి, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650కి చేరిందని వెల్లడించారు. వెయ్యి చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెరిగిందని తెలిపారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికుల ఖర్చు ఇలా అన్నీ పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగునపరిచి గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదన్నారు. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



# భారత్‌కు మరిన్ని ఎస్-400 క్షిపణులు

- రష్యాతో ఒప్పందం కుదుర్చుకోనున్న ఇండియా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**

ఆపరేషన్ సిందూర్‌లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలను భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని రక్షణ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్`400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈమేరకు ఐదు కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో విజయవంతంగా పనిచేసింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. వీటి పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాక్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ దూరంలో ఎస్400 కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్400 అనేది ఒకే మిసైల్ కాదు.. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం భారత్ మొత్తం ఐదు ఎస్400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు నాలుగు యూనిట్లు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో ఐదు యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**



భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్` జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని, అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని సూచించారు.. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచించారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వీడియో విడుదల చేశారు. 'దేశ ప్రజలకు అభినందనలు.. 7.8 శాతం వృద్ధి గొప్ప విషయం.. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం.. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది.. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది.. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే.. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది.. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు.. అయినా భారత్ పురోగమిస్తోంద'ని ఆ వీడియోలో పేర్కొన్నారు. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉంది' అని మోదీ పేర్కొన్నారు.

# ఆగస్టులో జీఎస్టీ వసూళ్ల జోరు

- గతేడాదితో పోల్చితే 14.8 శాతం అధికం
- తాత్కాలిక గణాంకాలు విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**

దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతున్నదనడానికి సంకేతంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకంగా నమోదయ్యాయి. ఆగస్టు నెలకు జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,99,853 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 14.8 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతుల పై పన్నుల వసూళ్లు గణనీయంగా పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక గణాంకాలను మంగళవారం విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.1,74,116 కోట్లుగా ఉండగా ఈసారి దాదాపు రూ.2 లక్షల కోట్ల మార్కుకు చేరువయ్యాయి. ఈ ఏడాది జులైలో నమోదైన రూ.2.11 లక్షల కోట్లతో పోలిస్తే ఆగస్టు వసూళ్లు కొంత తక్కువగా ఉన్నాయి. ఈ వృద్ధిలో దిగుమతుల నుంచి వచ్చిన జీఎస్టీ కీలక పాత్ర పోషించింది. దిగుమతులపై స్థూల జీఎస్టీ ఆదాయం ఏకంగా 29 శాతం పెరిగి రూ.62,604 కోట్లకు చేరింది. మరోవైపు, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ కూడా 9.3 శాతం వృద్ధితో రూ.1,37,249 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఆగస్టులో ప్రభుత్వం చెల్లించిన రిఫండ్‌లు కూడా భారీగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రిఫండ్‌లు 67.9 శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. దీంతో రిఫండ్‌లను మినహాయించిన తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1,68,057 కోట్లుగా ఉంది. ఇది గతేడాది నికర ఆదాయంతో పోలిస్తే 8.3 శాతం మాత్రమే ఎక్కువ. నికర వసూళ్లను విశ్లేషిస్తే కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.49,299 కోట్లకు చేరగా, దేశీయ నికర జీఎస్టీ వసూళ్ల వృద్ధి మాత్రం కేవలం 3.4 శాతానికే పరిమితమై రూ.1,18,759 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిఫండ్‌లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ గణాంకాలు వెలువడిన నేపథ్యంలో ఈనెల 12న ఢిల్లీలో 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి ఒకరోజు ముందు అధికారులస్థాయి సమావేశం కూడా జరగనున్నట్లు జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది.

# నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్ ఎత్తివేత

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :**



నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్ లను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడించింది. ఢిల్లీ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కోర్టు కొట్టివేసింది. ఢిల్లీ పరిధిలో జంతర్ మంతర్ వద్ద జూలై 2025 వరకు జరిగిన నిరసనలపై 13 ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. అయితే ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి కేసులు ఉండవు. కానీ, గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు కొనసాగుతాయి. అలా 2,873 మందిపై నమోదైన ఎఫ్ ఐఆర్ లు మాత్రం కొనసాగుతాయని కోర్టు తెలిపింది. నీట్ ఆందోళనలపై అన్ని రాష్ట్రాల్లో నమోదైన కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. పరిహారం అందించేందుకు మూడు నెలల్లో విధివిధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం తెలిపినట్టు కోర్టు పేర్కొంది.

# ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదు

- పాక్ ప్రధాని సమక్షంలో మోదీ కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదానికి ఆశ్రయం, మద్దతుపై గట్టి సందేశం
- ఉగ్రవాద వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని పిలుపు
- ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదని స్పష్టీకరణ
- సార్వభౌమత్వాన్ని గౌరవించేలా మౌలిక వసతుల ప్రాజెక్టులు

**బిష్కెక్, సెప్టెంబర్ 1:**



కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోదీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ''ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు'' అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు**

ఎస్‌సీఓ దేశాధినేతలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలపై అంతర్జాతీయ సమాజం గట్టి హెచ్చరిక చేయాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్ని దేశాలు ఒకే గొంతుతో స్పష్టం చేయాలని పిలుపునిచ్చారు.

**ఉగ్రవాద వ్యవస్థను నిర్మూలించాలి**

ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అంశాలపై దేశాలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. 2025లో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే.

**సార్వభౌమత్వానికి గౌరవం**

మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోదీ అన్నారు. అయితే అలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు.

**అగ్రనేతల హాజరు**

బిష్కెక్‌లో జరిగిన సమావేశానికి మోదీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్‌జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మోన్ తదితరులు హాజరయ్యారు.

**2001లో ఏర్పడిన ఎస్‌సీఓ**

పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకర సహకారాన్ని ప్రోత్సహించడం ఎస్‌సీఓ ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి.

# సెప్టెంబర్ 5 నిరసన రద్దు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:**

కాక్రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన నిరసన మార్చ్‌ను రద్దు చేసింది. ఢిల్లీతో పాటు బీజేపీ పాలిత నాలుగు రాష్ట్రాల్లో నీట్ ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని, ఇకపై కొత్త కేసులు నమోదు చేయబోమని కేంద్రం సుప్రీంకోర్టుకు హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ విషయాన్ని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఢిల్లీ పోలీసులు, బీజేపీ పాలిత రాష్ట్రాల వైఖరిని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 5 నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.

**కేంద్రం కీలక హామీలు**

ఢిల్లీ, బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అసోం పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు పలు హామీలు ఇచ్చారు. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని, వాటిలో ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోమని తెలిపారు. నిరసనలకు సంబంధించి ఇకపై కొత్తగా ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. నిరసనకారులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని, అనంతరం పలు అంశాలపై అవగాహన కుదిరిందని చెప్పారు.

**ఆర్టికల్ 142తో ఎఫ్ఐఆర్‌ల రద్దు**

ఈ నేపథ్యంలో సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ పోలీసులు ఆందోళనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కొట్టివేయాలని సొలిసిటర్ జనరల్ కోర్టును కోరారు. పూర్తి న్యాయం చేసేందుకు ఆర్టికల్ 142ను వినియోగిస్తూ నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై నమోదైన కేసులు కొనసాగుతాయని పేర్కొంది.

**సెప్టెంబర్ 5 నిరసనకు పిలుపు**

జూలై 25న కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలో దేశవ్యాప్త నిరసన మార్చ్‌కు పిలుపునిచ్చింది. జూలై 25 తర్వాత దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలను ఉపసంహరించుకున్నప్పటికీ, కేంద్రం హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ మరోసారి ఆందోళనకు సిద్ధమైంది. సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకున్నారు. తాజాగా కేంద్రం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీల నేపథ్యంలో నిరసనను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**మృతుల కుటుంబాలకు పరిహారం**

నీట్ పేపర్ లీక్ తర్వాత ఆత్మహత్యలకు పాల్పడి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే హామీకి కేంద్రం కట్టుబడి ఉందని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే పరిహారం చెల్లింపునకు సంబంధించిన విధివిధానాలను ఇంకా ఖరారు చేయాల్సి ఉందన్నారు. పలు రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నందున పరిహారం సాధారణ నిబంధనగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వివరించారు.

**మూడు నెలల్లో విధివిధానాలు**

రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో చర్చించి పరిహార పథకాన్ని ఖరారు చేసేందుకు మూడు నెలల సమయం అవసరమని కేంద్రం కోర్టుకు తెలిపింది. విధివిధానాలు ఖరారైన వెంటనే పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యల కేసుల్లో వారి కుటుంబాలకు పరిహారం అందించే విధివిధానాలను మూడు నెలల్లో ఖరారు చేసి, అనంతరం చెల్లింపులు చేపట్టాలని సీజేఐ సూర్యకాంత్ సూచించారు.



## బోనాల వేడుకల్లో పాల్గొన్న మారబోయిన రవి యాదవ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం బాపు నగర్ లో శ్రీ జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గోపి నగర్ లో పాండు గౌడ్, అరవింద్ గౌడ్ ఆధ్వర్యంలో, మధు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి పలారం బండి ఊరేగింపు, పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ దాడిని ఖండిస్తూ బీజేపీ నిరసన



### నేతల అరెస్ట్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడిని ఖండిస్తూ బీజేపీ పిలుపు మేరకు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నేతలు శాంతియుత నిరసన చేపట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని వారు ఖండించారు. దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బీజేపీ నేతలపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొండకల్ ఆనంద్ కుమార్, బుర్ర



మహేందర్ యాదవ్, శివ యాదవ్, రాజ వర్ధన్ రెడ్డి, వినోద్ కుమార్, లింగస్వామి, హర్షిత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది ఎండి. హుస్సేన్ నియామకం



**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ మరియు సమన్వయ కమిటీ (District Waqf Protection & Coordination Committee) సభ్యుడిగా ప్రముఖ సీనియర్ ముస్లిం న్యాయవాది అడ్వకేట్ ఎండి. హుస్సేన్‌ను జిల్లా కలెక్టర్ నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములు, ఆస్తుల పరిరక్షణ, అక్రమ ఆక్రమణల నిరోధం మరియు వక్ఫ్ సంస్థల హక్కుల రక్షణ కోసం ఈ కమిటీ ప్రత్యేకంగా పనిచేయనుంది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినందుకు జిల్లా కలెక్టర్‌కు అడ్వకేట్ ఎండి. హుస్సేన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, సమాజ సంక్షేమానికి కట్టుబడి తన విధులను పూర్తి అంకితభావంతో, నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బిజెపి ఆర్ఎస్ఎస్ పై కన్నెర్ర చేసి గలమెత్తిన కాంగ్రెస్ శ్రేణులు

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల అశోక్

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల అశోక్ ఆధ్వర్యంలో మండల కేంద్రం లో ఈరోజు లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై బీజేపీ కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు భాగంగా ఎఫ్ ఐ ఆర్ నమోదును నిరసిస్తూ రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ .జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆదేశాలమేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు అంతరం మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి. వినతిపత్రాన్ని సమర్పించారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల అశోక్ మాట్లాడుతూ శుద్ధీకరణ ఆచారం కు కొనసాగింపుగా, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఒక పత్రికా సమావేశంలో , ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ధృడవైఖరిని తీసుకున్నారని,రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా బీజేపీ



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తున్న ఉత్తరాఖండ్ పోలీసులు హల్ద్వానీ సిటీ కొత్వాలి పోలీసు స్టేషన్ లో రాహుల్ గాంధీ.పై దిగ్భ్రాంతికరంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని, కుల ఆధారిత వివక్షకు,దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం చేసిన వారిని అణిచివేయడానికి ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి శక్తిని ప్రయోగిస్తామని నిరూపించారని, ఈ కక్ష పూరిత రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తూ ,ఉత్తరాఖండ్ లోని దోషులైన బీజేపీ కార్యకర్తలపై తక్షణ న్యాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో విజ్ఞత గల ప్రజలు బిజెపి కి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొప్పుల అశోక్ ఉపాధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి చింతలపూడి రాము కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రామ సహాయం హరిత రెడ్డి అరవింద రెడ్డి ఉన్నం రాజశేఖర్ సర్పంచులు వనవాసం నరేందర్ రెడ్డి సంఘ భక్తుల సుమన్ రెడ్డి బోడ చంద్రు మోర అనిల్ రెడ్డి బానోత్ సిమ్లా నాయక్ గద్దల సుధాకర్ ధరావత్ సుజాత నరసింహారావు నందిపాటి మల్లికార్జున్ అన్నపర్తి రవి గుమ్మడి దేవభిక్షం నునావత్ సమ్మక్క అశోక్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్లమల్ల ప్రతాప్ నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి జడల నగేష్ గౌడ్ కట్కూరి శ్రీనివాస్ రెడ్డి ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉప్పనూతల నాగేశ్వరరావు బొల్లికొండ రాజశేఖర్ లంజపల్లి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ నల్లబెల్లి లింగయ్య రిటైర్డ్ ఎస్ఐ చుంచు కోటయ్య జడల నగేష్ గౌడ్ షేక్ షకీల్ పాషా పల్లె మల్లయ్య అంగిరేకుల సతీష్ షేక్ కరీం పత్తి నాగేశ్వరరావు పోలే పొంగు నరసింహారావు చీమ లక్ష్మయ్య బెల్లం రాము , చీమ లక్ష్మయ్య భాజా సత్యనారాయణ గోళ్ళ లింగయ్య అజ్మీర బాలాజీ బానోత్ అనిల్ కుమార్ ఉండేటి ప్రకాష్ బుర్ర వాసు నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు

## తాళం వేసి ఉంచిన ఒంటరి మహిళ ఇంట్లో చోరీ

**మూడు తులాల బంగారం, 30 తులాల వెండి చోరీ...**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్ పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప రెడ్డి గూడ నివాసి అయిన శ్రీమతి పంకంటి సరస్వతి (55) తేదీ 30.08.2026 ఆదివారం నాడు రాఖీ పండుగ సందర్భంగా తన కూతురు, అల్లుడుతో కలిసి మోమిన్ పేట్ మండల పరిధిలోని దుర్గంచెరువు గ్రామానికి వెళ్ళింది. అయితే మంగళవారం రోజు (01.09.2026) ఉదయం సమయం అందాజ 09:30 గంటలకు పక్కింటి వారు పంకంటి సరస్వతికి ఫోన్ చేసి తన ఇంట్లో దొంగతనం జరిగిన విషయం తెలిపినారు. ఇంటి యజమాని వచ్చి చెక్ చేసుకోగా ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం, అందాజ 30 తులాల వెండి, కొంత నగదు పోయినట్టుగా శంకర్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసు వారు ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ ను ఉపసంహరించుకోవాలి

### తుంబూరు దయాకర్ రెడ్డి

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం రూరల్ కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అక్రమంగా పెట్టిన ఎఫ్ఐఆర్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ క్రాస్ రోడ్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీలో రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.



అలాగే ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదిక ప్రాంతాన్ని "శుద్ధి" చేస్తున్నామనే నెపంతో, దళితుడైన ఆయనను తీవ్రంగా అవమానించిన బీజేపీ నేతల చర్య హేయమైనదని మండిపడ్డారు. బీజేపీ నేతలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, దళితులను అవమానించడం వారి అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, సీనియర్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, డివిజన్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెడికల్ రాజు కుటుంబాన్ని పరామర్శించిన టి జె ఏ జిల్లా కమిటీ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మారెడ్డి జిల్లాలోని టి జె ఏ సభ్యుడు రిపోర్టర్ అయినట్టి తాటి మెడికల్ రాజు గారి అన్నయ్య కంచరి తాటి శ్రీనివాస్ గుండెపోటుతో కొద్ది రోజుల క్రితం మరణించినందున ఈ రోజు టి జె ఏ కామారెడ్డి జిల్లా కమిటీ రామారెడ్డి లోని వారి ఇంటికి వెళ్లి వారిని వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎన్ యు జె (ఐ) జాతీయ ఉపాధ్యక్షులు ఉక్కల్కర్ రాజేంద్రనాథ్, టి జె ఏ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సడక్ సునీల్, టి జె ఏ కామారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీధర్ సి హెచ్, టి జె ఏ సభ్యులు ఎల్లన్న, నవీన్, భైరు, రామ్మూర్తి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో హాస్టల్ నిర్మాణాల ఆలస్యంపై విద్యార్థులు ఆందోళన...

- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు ధర్నా, ప్రభుత్వ తీరుపై నిరసన
- డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక దీక్షలు
- ఎస్ఎఫ్ఐ హెచ్చరిక...

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల ప్రాంతంలో విద్యార్థుల వసతి గృహాల నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర ఆలస్యంపై ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దని





వెంటనే హాస్టల్ నిర్మాణం ప్రారంభించాలని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ....అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. 2018 సంవత్సరంలోనే ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలు మంజూరు అయినప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఒక్క ఇటుక కూడా వేయకపోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి దర్శనం అన్నారు. నాయకుల పర్యవేక్షణ లోపల లేక అధికారుల నిర్లక్ష్యమా.... మంజూరు చేసిన వసతి గృహాలను ఏళ్లు గడుస్తున్న ప్రారంబించకపోవడం నాయకుల, అధికారుల పనితీరులకు నిదర్శనం అని చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే మేల్కొని విద్యార్థుల పరిస్థితులు అర్థం చేసుకొని వెంటనే వసతి గృహాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అక్రమ పట్టాలపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశం

**పట్టా భూములుగా మార్చిన ఆఫీసర్లకు చర్యకు ఆదేశం**

**బీర్కూర్: రాజముద్ర న్యూస్:** – కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామ శివారులో గల అటవీ భూములను కొందరు కబ్జా చేశారని సాయాగౌడ్ అనే వ్యక్తి కలెక్టర్కు గత నెల 25వ తేదిన కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయమై అటవీ భూములను అక్రమంగా పట్టా చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెవెన్యూ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. బీర్కూర్ మండలం మల్లాపూర్ శివారులోని సర్వే నెం. 84/1 లో గల అటవీ భూములలో అక్రమ పట్టాలు జారీ చేసినట్లు అమృతం


GOVERNMENT OF TELANGANA

Lr No: E1/452/2025-1

Dt:25.08.2026

Ref:- 1.CCLA,TG Hyd Memo.No.3599/ Land Admin.IV/A1/2025-1, Dt.18.02.2025

2.Collr. Kmr Lr.No.E1/452/2025 Dt:12.3.2025 & 3.5.2025.

3.Tahsildar, Birkur, Lr.No. B/185/2025, Dt.29.03.2025.

4.RDO, Banswada, Lr.No. H2/2725/2026, Dt.21.08.2026.

Attention is invited to the ref. 2nd cited wherein it was requested enquire into the matter and send report along with record of enquiry viz. Forest Gazette, maps, Revenue Records, 22A list, and if the allegations of the petitioner are found correct & take action as per rules and furnish the name of the Revenue Officers involved in the alleged illegal issuance of patta in Forest lands and send report but the report received in the reference 3rd & 4th cited are not specific, precise conclusive, whereas the allegations of the petitioner is that illegal pattas were issued in the Forest land spread over Ac.150.00 gts in Sy.No.84/1 situated at Mallapur (V) Birkur (M) & the applicant has sought the action taken against the Revenue / Forest Officials involved in issuance of illegal pattas, it is not reported whether the allegation is established if so the officers responsible & action taken against them.

Therefore, the Revenue Divisional Officer, Banswada / Tahsildar, Birkur are once again requested to personally enquire into the complaint filed by the petitioner and report specifically as to whether any illegal pattas were issued forest lands if so the details, officers involved, action taken and send precis

సాయాగౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ చేపట్టి నిజమైతే ఆ సంబంధిత శాఖ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే నెం. 84/1లో ఉన్న 150.00 ఎకరాల అటవీ భూమిలో చట్టవిరుద్ధ పట్టాలు జారీ చేయబడ్డాయని పిటిషనర్ ఆరోపించారు. ఈ చట్టవిరుద్ధ పట్టాల జారీలో ప్రమేయం ఉన్న రెవెన్యూ , అటవీ ఆఫీసర్లపై చర్య తీసుకోవాలని దరఖాస్తుదారు కోరారు. పిటిషనర్ దాఖలు చేసిన ఫిర్యాదుపై బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, బీర్కూర్ తహసీల్దార్ స్వయంగా విచారణ జరిపి, అటవీ భూములకు ఏవైనా అక్రమ పట్టాలు జారీ చేయబడ్డాయా?.. అనే దానిపై నిర్దిష్టంగా నివేదికను సమర్పించి, ఒకవేళ జారీ చేయబడితే, దాని వివరాలు, ప్రమేయం ఉన్న అధికారులు, తీసుకున్న చర్యలతో పాటు విచారణ రికార్డుతో కూడిన కచ్చితమైన నివేదికను పంపవలసిందిగా బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్కు, బీర్కూర్ తహసీల్దార్ కు సూచించారు.

## నేలకొండపల్లిలో నూతన ఉప తపాలా కార్యాలయం ప్రారంభం

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి నూతన ఉప తపాలా కార్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా తపాలా కార్యాలయాల సూపరింటెండెంట్ వి. వీరభద్ర స్వామి ఘనంగా ప్రారంభించారు.నేలకొండపల్లి సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీ జి. కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవం మరియు డిసిడిపి కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఖమ్మం సౌత్ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ పోస్ట్స్ పి. శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేలకొండపల్లి సర్పంచ్ శీలం వెంకట లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, ఐపీపీబీ మేనేజర్ రాజేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు



మాట్లాడుతూ తపాలా శాఖ అందిస్తున్న వివిధ సేవలు, పొదుపు పథకాలు, బీమా, ఐపీపీబీ సేవల గురించి ప్రజలకు వివరించారు. వాటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిసిడిపి కార్యక్రమంలో భాగంగా తపాలా శాఖ అందిస్తున్న ప్రజా ప్రయోజనకర సేవలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీయర్లు ఎం. లక్ష్మణ్, పి. నాగేశ్వరరావు, ఎస్ఓ పరిధిలోని బీపీఎంలు, ఏబీపీఎంలు, కార్యాలయ సిబ్బంది పోస్టల్ అసిస్టెంట్ కనకాచారి, పోస్ట్ మెన్ శ్రీ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.నూతన ఉప తపాలా కార్యాలయం ద్వారా నేలకొండపల్లి మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన తపాలా సేవలు అందుబాటులోకి రానున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే యాదయ్య...

**లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రోజు చేవెళ్ల ఎమ్మెల్యే కాలు యాదయ్య స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 45 మంది లబ్ధిదారులకు 23 లక్షల 50 వేల రూపాయల గల చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూకట్పల్లి ఎమ్మెల్యే పాదయాత్రను అడ్డుకోండి

- కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు
- హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చెప్పకోవడమే తప్ప చేసింది ఏమీ లేదు: మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** సెప్టెంబర్ 2 తేదీ బుధవారం నుండి కూకట్పల్లి నియోజక వర్గంలో పాదయాత్ర చేస్తున్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ప్రజలు అడ్డుకోవాలని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే భూములను 22ఎ నిషేధిత జాబితాలో పెట్టడం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సరికాదని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పాపమే నేడు అమాయక ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేవలం మాటలకే పరిమితం అయ్యారని, ఆయన చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. పాదయాత్ర పేరుతో బస్తీల్లో ఎంత తిరిగినా ఇప్పుడు ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చెప్పుకోవడమే తప్ప చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్ లో సాయినగర్, వినాయకనగర్ ప్రాంతాల్లోని నాలాకు రిటైనింగ్ వాల్ ఇప్పటి వరకు నిర్మించక పోవడం విడ్డూరం అని పేర్కొన్నారు. రెండు సార్లు బాలానగర్ డివిజన్ కు బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించారు కానీ ఆ కాలంలో అంటే 10 సంవత్సరాలు బాలానగర్ ఓల్డ్ విలేజ్ లోని వెటర్నరీ, లైబ్రరీ ఉన్న పాత భవనాన్ని నిర్మించలేకపోయారని తీవ్రంగా విమర్శించారు.

## హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్

**జల్లేపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంలో వంటలు, ఆహార పదార్థాలు, పరిశుభ్రతపై పరిశీలన...**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) షేక్ సిలార్ సాహెబ్ గురువారం సాయంత్రం 7:30 గంటలకు జల్లేపల్లి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, వంటశాల నిర్వహణ, ఆహార పదార్థాల నిల్వ, పరిసరాల పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందుతున్నదా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు వంటలను పరిశీలించిన ఎంపీడీవో.. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**వారం వారం హాస్టల్ తనిఖీలు**

ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ హాస్టళ్లను తరచూ తనిఖీ చేస్తూ విద్యార్థులకు మెరుగైన వసతులు అందేలా చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థుల భోజనం, వసతి, పరిశుభ్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలనే లక్ష్యంతో ఆయన నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. "విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం" అనే దృక్పథంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రేపు 'ఛలో పాలేరు' మహా ధర్నా

**మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి హాజరు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చకుండా ప్రజలను, రైతులను మోసం చేసిందని నిరసిస్తూ రేపు బుధవారం 'ఛలో పాలేరు' మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ, పాలేరు మాజీ శాసనసభ్యులు శ్రీ కందాల ఉపేందర్ రెడ్డి



ఆధ్వర్యంలో రేపు ఉదయం 10:45 గంటలకు పాలేరు రిజర్వాయర్ ప్రాంగణంలో రైతుల హక్కుల సాధన కోసం ఈ మహా ధర్నా జరుగుతుందని పేర్కొన్నారు.రేపు 'ఛలో పాలేరు' మహా ధర్నా రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగునీటి సమస్యలు, రుణమాఫీ, రైతు భరోసా వంటి అంశాలపై పోరాడేందుకు నేలకొండపల్లి మండలంలోని గ్రామ శాఖల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి 'ఛలో పాలేరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో మండల సెక్రెటరీ వెన్నబోయిన శ్రీను, నేలకొండపల్లి సర్పంచ్ శీల వెంకట లక్ష్మి , కోనాయిగూడెం సర్పంచ్ కోటి సైదిరెడ్డి, తిరుమలాపురం సర్పంచ్ కామదాన ప్రవీణ్, రాజేశ్వరపురం సర్పంచ్ దండ రంగయ్య, చెరువుమాదారం సర్పంచ్ అమరగాని ఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య, టౌన్ సెక్రెటరీ ఎండి వాజిద్, మండల నాయకులు ఎస్కే హుస్సేన్, అనగాని నరసింహారావు, మరికంటి రేణుబాబు, సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం, వార్డు సభ్యులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల బోనస్ నిబంధనలు రైతులకు గుదిబండగా మారాయి

**బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, సన్నరకాల వడ్లకు ప్రభుత్వం ఇచ్చే బోనస్ పొందాలంటే ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు గుదిబండగా మారాయని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ విమర్శించారు. సోమవారం నిర్వహించిన భారతీయ జనతా పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సొంతంగా తయారు చేసుకున్నా, ఇతర రైతుల నుంచి కొనుగోలు చేసిన విత్తనాలపై ప్రభుత్వం పెట్టిన నిబంధనలు అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు.దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తన రకాలను రసీదులతో ఆ దుకాణాల్లోనే ఆన్ లైన్ చేయించుకోవాలనే నిబంధన ఒకటైతే, రైతులు సొంతంగా



తయారుచేసుకున్న లేదా ఇతర ప్రాంత రైతుల నుంచి ఎలాంటి రసీదు లేకుండా కొనుగోలు చేసిన విత్తనాలను ఏఈవోల వద్ద స్వీయ నమోదు చేసుకోవాలంటే విధిగా రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలు చేసిన స్టాంప్ పేపర్ పై ఉన్న బాండ్ ను సమర్పించాలనే నిబంధన శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే బోనస్ సంగతి దేవుడెరుగు కానీ, ఇలాంటి తలాతోకా లేని నిబంధనలు పెట్టడం పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సన్నరకాల వడ్లకు బోనస్ కోసం విత్తనాల వివరాలను దుకాణాల్లో నమోదు చేయాలనే జీవోను వెంటనే రద్దు చేయాలని, ఎల్ నినో ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, తెలంగాణ రైతుల కోసం ఫసల్ బీమా యోజనను అమలు పరచాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కిసాన్ మోర్చా మండల నాయకులు సురేపల్లి జ్ఞానరత్నం, జి. సురేష్, పి. దివాకర్, కె. హర్షవర్ధన్, డి. వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి

**జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్**



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా మోపిన అక్రమ కేసులను వెంటనే రద్దు చేయకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ హెచ్చరించారు. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రవెల్లి స్వర్ణ నేతృత్వంలో మంగళవారం నాడు గాంధీ భవన్ ఆవరణలో బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.

**ఈ సందర్భంగా జ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ.....**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, మహిళల, యువత, రైతుల సమస్యల తో పాటు, ఇటీవల కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు సీనియర్ పార్లమెంట్ సభ్యులు మల్లిఖార్జున ఖర్గే పై జరిగిన కులవివక్ష ఘటన లో ఆయనను అవమానించిన బీజేపీ వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చెయ్యాలని గళం విప్పుతున్న రాహుల్ గాంధీ గొంతు నొక్కేందుకు బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి సంస్థలను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు.దీన్ని మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందని జ్యోతి భీమ్ భరత్ తెలిపారు.రాహుల్ గాంధీ దేశ ప్రజలకు దగ్గరయ్యారనే కక్షతోనే ఈ అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు.బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా, కాంగ్రెస్ శ్రేణులు, మహిళా కాంగ్రెస్ ప్రజాస్వామ్యానికి అండగా ఉంటుందన్నారు. వెంటనే అక్రమ కేసులను ఉపసంహరించుకోకపోతే రంగారెడ్డి జిల్లాతో పాటు దేశ వ్యాప్తంగా ప్రతి మండలంలో నిరసనలు, ధర్నాలు చేపడతాం" అని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాళ్లు, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్లో వినతి పత్రం ఇచ్చిన టీ జే ఎ..

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీ జే ఏ), ఎన్‌యూజే (ఐ) కామారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా చైర్మన్, మేజిస్ట్రేట్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లగా, కలెక్టర్ సెలవు పై ఉన్నందున, జిల్లా రెవిన్యూ అధికారి పాండు నాయక్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా టీ జే ఎ అధ్యక్షుడు సడక్ సునీల్ మాట్లాడుతూ... జిల్లాలో వివిధ పత్రికలు, న్యూస్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులైన జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య, సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల పిల్లల విద్యకు సంబంధించి విద్యా సహాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల్లో సహకారం అందించాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలో నిర్వహించే ప్రెస్‌మీట్లు, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని జర్నలిస్టులకు సకాలంలో అందించాలని, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ



చేయాలని కోరారు.జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పరిష్కార చర్యలు చేపట్టాలని, ప్రతి రెండు నెలలకు ఒకసారి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించి దరఖాస్తు చేసుకున్న అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని TJA, NUJ(I) జిల్లా కమిటీ కోరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ యూ జే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు వి. రాజేందరనాథ్, టీ జే ఎ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్, టీ జే ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ సీఐ. హెచ్, ఉపాధ్యక్షులు ఆమృత్ రావు, వర్కింగ్ సెక్రెటరీ మోహన్, శ్రీనివాస్ రావు, కార్యదర్శి నవీన్, కోశాధికారి సుందర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క సిద్ది రాములు, టీ జే ఎ సభ్యులు ఫర్వేజ్, రేణుకుమార్, బిక్కనూర్ సాయిలు, కమ్మరి నవీన్, కుమ్మరి ఎల్లన్న, రామ్మూర్తి, కడెం భైరయ్య, టీ. సాయిలుతో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సైన్స్ పోటీలలో విద్యార్థుల అద్భుత ప్రతిభ

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** శాస్త్ర ది న్యూ ఏజ్ స్కూల్, సూర్యాపేట బ్రాంచ్ విద్యార్థులు మరోసారి తమ అత్యుత్తమ విద్యా ప్రమాణాలను, శాస్త్రీయ ప్రతిభను చాటుకున్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలలో పాఠశాల విద్యార్థులు పాల్గొని రెండు బహుమతులను సాధించి పాఠశాలకు ఘనతను తీసుకు వచ్చారు. ఈ పోటీలలో ఎం. వాగ్దేవి, ఎం. విరూపాక్ష, ఎం. వకులవర్మ, కృతిక, భావ్య, సాన్విక, దీక్షిత్, శరత్, యశ్వంత్ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల కృషి, సృజనాత్మకత, సమన్వయం శాస్త్రీయ ఆలోచనా



విధానానికి గుర్తింపుగా రెండు జిల్లా స్థాయి బహుమతులను అందుకున్నారు. ఈ బహుమతులను జిల్లా సైన్స్ అధికారి శ్రీ దేవరాజ్ అందజేశారు.విద్యార్థులకు పాఠశాల సీనియర్ ఫ్యాకల్టీ కెమిస్ట్రీ ఉపాధ్యాయులు నజీర్ మార్గదర్శకత్వం శిక్షణ అందించారు.ఆయన చేసిన నిరంతర కృషి, ప్రోత్సాహం విద్యార్థుల విజయానికి ఎంతో దోహదపడింది. వివిధ విద్యా, సైన్స్ ఇతర పోటీలలో పాల్గొన్న ప్రతిసారి బహుమతులు సాధిస్తూ శాస్త్ర ది న్యూ ఏజ్ స్కూల్ తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. ఈ విజయం పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అందిస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా శాస్త్ర ది న్యూ ఏజ్ స్కూల్ చైర్మన్ ఎం. చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఎస్.కె. జహంగీర్, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం అందించిన నజీర్ను అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు సూర్యాపేట జిల్లాకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



# పాక్ క్రికెట్‌లో ముసలం!

## సెలెక్టర్ పదవికి మిస్బా రాజీనామా

## సీనియర్ల వేటుపై తీవ్ర అసంతృప్తి

## ఏడుగురు ఆటగాళ్లను ఇంటికి పంపిన పీసీబీ

## కోచ్ సర్ఫరాజ్, ఉమర్ గుల్‌పైనా వేటు

## ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోయిన పాక్

**లండన్:** అనిశ్చితికి మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి ముసలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న కఠిన నిర్ణయాలు జట్టులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సిరీస్ మధ్యలోనే సీనియర్ ఆటగాళ్లను స్వదేశానికి పంపడంతో పాటు కోచింగ్ బృందంపైనా వేటు వేయడాన్ని నిరసిస్తూ సెలెక్టర్ మిస్బావుల్ హక్ తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ టెస్టులో పాకిస్థాన్ ఘోర పరాజయం తర్వాత పీసీబీ ప్రక్షాళనకు దిగింది. జట్టులోని ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపాలని నిర్ణయించింది. అంతటితో ఆగకుండా కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను బాధ్యతల నుంచి తప్పించి.. మూడో టెస్టుకు వైట్‌బాల్ కోచ్ మైక్ హెసన్‌కు బాధ్యతలు అప్పగించింది. బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌పైనా వేటు వేసింది. తాము ఎంపిక చేసిన జట్టులోని ఆటగాళ్లను సిరీస్ మధ్యలోనే తొలగించడం, కోచింగ్ బృందాన్ని మార్చడంపై మిస్బా తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. బోర్డు నిర్ణయాలతో మనస్తాపం చెందిన అతడు మంగళవారం సెలెక్టర్ పదవికి హఠాత్తుగా రాజీనామా చేశాడు. అయితే మిస్బా రాజీనామాను పీసీబీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్ బాధ్యతల నుంచి కూడా అతడు తప్పుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. లార్డ్స్ టెస్టు పరాజయం తర్వాత మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జఫార్, ఖుర్రం షెహజాద్‌లను జట్టు నుంచి తప్పించినట్లు సమాచారం. వీరి స్థానంలో సయీం అయూబ్‌తో పాటు అరాఫత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్, సాద్ బైగ్, ఇమ్రాన్ రంధవా, రజుల్లాహ్ తదితర యువ ఆటగాళ్లకు చివరి టెస్టులో అవకాశం కల్పించనున్నారు. హెడింగ్లేలో తొలి టెస్టును సొంతం చేసుకున్న ఇంగ్లండ్.. లార్డ్స్‌లోనూ జోరు కొనసాగించింది. 389 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ బ్యాటింగ్ మరోసారి కుప్పకూలింది. షాద్ షకీల్ 97 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఓలీ రాబిన్సన్ (4-24), జోష్ టంగ్ (3-46), జోఫ్రా ఆర్చర్ (2-73) విజృంభించడంతో ఇంగ్లండ్ 194 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సిరీస్‌ను కైవసం చేసుకోగా.. పాకిస్థాన్‌కు మూడో టెస్టు నామమాత్రంగా మారింది. చివరి టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లో జరగనుంది. ఓవైపు వరుస ఓటములు.. మరోవైపు సీనియర్లపై వేటు.. ఇప్పుడు సెలెక్టర్ మిస్బా రాజీనామా.. వెరసి పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి సంక్షోభ మేఘాలు కమ్ముకున్నాయి.

# టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ ర్యాంప్!

- బాస్కెట్‌బాల్ దిగ్గజం లుక్‌లో ఒసాకా
- అలెన్ ఐవెర్సన్‌కు స్టయిల్‌తో నివాళి
- యూఎస్ ఓపెన్‌లో మరోసారి ప్రత్యేక ఆకర్షణ
- ఆటతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర
- తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ



**న్యూయార్క్:** టెన్నిస్ కోర్టులో ఆటతో ప్రత్యర్థులను హడలెత్తించడమే కాదు.. తన ఫ్యాషన్‌తో ప్రేక్షకులను అబ్బురపరచడం జపాన్ స్టార్ నవోమి ఒసాకాకు కొత్తేమీ కాదు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ వచ్చిందంటే చాలు.. ఏదో ఒక ప్రత్యేక థీమ్‌తో కోర్టులోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షిస్తుంటుంది. తాజాగా యూఎస్ ఓపెన్-2026లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. ఈసారి అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం అలెన్ ఐవెర్సన్‌ను గుర్తుచేసే లుక్‌తో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్ కోసం ఒసాకా వినూత్న వేషధారణతో కోర్టులోకి వచ్చింది. పొడవాటి తెల్లని స్కర్ట్, వదులుగా ఉన్న హుడీతో ప్రవేశించిన ఆమె.. ఆ తర్వాత వాటిని తొలగించి ఐవెర్సన్‌ను తలపించే స్టయిల్‌లో కనిపించింది. జుట్టును 'కార్న్‌రోస్' తరహాలో తీర్చిదిద్దుకోవడంతో ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కోర్టులోకి వచ్చే ముందు ఐవెర్సన్ చిత్రం ముద్రించిన షర్ట్‌ను ధరించి అతడిపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. తన కొత్త లుక్‌పై ఒసాకా స్పందిస్తూ.. ఐవెర్సన్ ఆటతో పాటు అతడి ఫ్యాషన్ తనకు ఎంతో ఇష్టమని తెలిపింది. తనదైన స్టయిల్‌తో బాస్కెట్‌బాల్ ప్రపంచంలో ప్రత్యేక ముద్ర వేసిన ఐవెర్సన్.. క్రీడాకారుల దుస్తుల తీరుపైనా ప్రభావం చూపాడని పేర్కొంది. 'ఫ్యాషన్‌తోనూ మన వ్యక్తిత్వాన్ని చెప్పొచ్చు' అన్న భావనను ఒసాకా వ్యక్తం చేసింది. తనను అనుకరిస్తూ ప్రత్యేక లుక్‌లో కోర్టులోకి వచ్చిన ఒసాకాపై ఐవెర్సన్ కూడా ప్రశంసలు కురిపించాడు. తనకు దక్కిన గొప్ప గౌరవంగా దీనిని అభివర్ణిస్తూ ఆమెను ప్రత్యక్షంగా చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు సందేశం పంపాడు. ఫ్యాషన్‌తోనే కాకుండా ఆటలోనూ ఒసాకా ఆకట్టుకుంది. తొలి రౌండ్‌లో జఖరోవాపై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. విభిన్న వేషధారణతో గ్రాండ్‌స్లామ్‌లలో సందడి చేయడం ఒసాకాకు అలవాటే. గత యూఎస్ ఓపెన్‌లో 'లబుబు' బొమ్మలతో ప్రత్యేకంగా కనిపించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఆక్వా బ్లూ రంగు జాకెట్, వెడల్పాటి తెల్లని ప్యాంట్, తెల్లటి ముసుగు, టోపీ, చేతిలో గొడుగుతో ఫ్యాషన్ సుందరిలా కోర్టులోకి అడుగుపెట్టి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. రాకెట్‌తో ఆటలో తనదైన ముద్ర.. వేషధారణతో ఫ్యాషన్‌లో ప్రత్యేక ముద్ర.. రెండింటినీ కలిపి టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేస్తోంది నవోమి ఒసాకా.

# పాటిదార్‌పై ఇషాన్ పైచేయి!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్
- 4 వికెట్ల తేడాతో సెమీస్‌లో గెలుపు
- వైభవ్, ఇషాన్ మెరుపు బ్యాటింగ్
- ఏడు వికెట్లతో ముకేశ్ కుమార్ సత్తా
- దూబే తిప్పేసినా తప్పని ఓటమి



**బెంగళూరు:** దేశవాళీ సీజన్‌లో ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇషాన్ కిషన్ సేన సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39) బ్యాట్‌తో మెరవగా.. ముకేశ్ కుమార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన సెమీఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్ (60) అర్ధశతకంతో రాణించినా ప్రత్యర్థి జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. అనంతరం హర్ష్ దూబే (4-66), ఆర్యన్ పాండే (3-43) బంతితో విజృంభించడంతో ఈస్ట్‌జోన్ కూడా సరిగ్గా 266 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ముగిసేసరికి రెండు జట్లు సమానంగా నిలిచాయి.

### ముకేశ్ దెబ్బకు 158కే కుప్పకూలి..

రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి ఈస్ట్‌జోన్‌కు సవాల్ విసరాలని భావించిన ప్రత్యర్థి జట్టుకు ముకేశ్ కుమార్, అభిజిత్ సర్కార్ షాకిచ్చారు. వీరిద్దరి ధాటికి బ్యాటింగ్ లైనప్ నిలవలేక 158 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఈస్ట్‌జోన్ ముందు 159 పరుగుల లక్ష్యం నిలిచింది.

### వైభవ్ ధనాధన్.. ఇషాన్ దంచుడు

స్వల్ప లక్ష్య ఛేదనలో ఈస్ట్‌జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (24), వైభవ్ సూర్యవంశీ (40) దూకుడుగా ఆడి శుభారంభం అందించారు. ముఖ్యంగా వైభవ్ వేగంగా పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అయితే హర్ష్ దూబే మరోసారి బంతితో చెలరేగి 53 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టడంతో ఈస్ట్‌జోన్ కాస్త తడబడింది. అయితే గాయం కారణంగా రెండో రోజు ఆటకు దూరమైన కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక సమయంలో బాధ్యత తీసుకున్నాడు. 39 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్ కొట్టడంతో ఈస్ట్‌జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుని ఫైనల్లో అడుగుపెట్టింది. దూబే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బంతితో పోరాడినా.. వైభవ్ దూకుడు, ఇషాన్ కీలక ఇన్నింగ్స్, ముకేశ్ కుమార్ బౌలింగ్ జోరుతో ఈస్ట్‌జోన్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది.



# అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలి

## అదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్

**బెంగళూరు:** మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటగల పేసర్‌గా ఎదగడమే తన ప్రధాన లక్ష్యమని భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ తెలిపాడు. సీనియర్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బౌలింగ్ చేయడం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పాడు. ముఖ్యంగా బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించేందుకు వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు భారత్ తరఫున ఆరు వన్డేలు ఆడిన గుర్నూర్ 6.96 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి అంతర్జాతీయ కెరీర్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున కనబరిచిన ప్రదర్శనతోనే భారత జట్టులో అవకాశం దక్కిందని తెలిపాడు. "బౌలింగ్‌లో లెంగ్త్‌ను నిలకడగా కొనసాగించడం, పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలన్న అంశాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. ఎన్ని ఓవర్లు వేసినా శరీరంపై ఎక్కువ ప్రభావం పడకుండా ఫిట్‌నెస్‌ను తీర్చిదిద్దుకోవాలన్నది మొదటి నుంచీ నా లక్ష్యం" అని గుర్నూర్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సలహాలతో తన బౌలింగ్‌లో గణనీయమైన మార్పు వచ్చిందన్నాడు. "బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల బౌలింగ్‌ను దగ్గరగా పరిశీలించా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. వారిలాగే అన్ని ఫార్మాట్లలో రాణించే పేసర్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తున్నా" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్.. సౌత్‌జోన్‌తో జరిగిన సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి మరోసారి తన సత్తా చాటాడు.

# ఆఫ్ఘన్‌తో టీ20 పోరుకు టీమిండియా రెడీ

- కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్
- వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ
- వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు
- బుమ్రా పునరాగమనం
- సెప్టెంబర్ 13 నుంచి మూడు మ్యాచ్‌ల సిరీస్



**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ సిరీస్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా.. హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. బ్యాటింగ్ విభాగంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ కూడా జట్టులో చోటు సంపాదించారు. సంజూ, ఇషాన్ వికెట్ కీపర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం లభించింది. స్పిన్ బాధ్యతలను వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ పంచుకోనున్నారు.

### బుమ్రా పునరాగమనం


పేస్ విభాగంలో స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాల ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఉంటుందని సెలక్షన్ కమిటీ తెలిపింది.

### సెప్టెంబర్ 13 నుంచి సమరం

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో 3 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశమిస్తూ, అనుభవజ్ఞులను జోడించి ఎంపిక చేసిన భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో పోరుకు సిద్ధమవుతోంది. భారత జట్టు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

# 6న బాలయ్య సినిమా అప్డేట్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తున్న లేటెస్ట్ చిత్రాన్ని NBK111 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని యంగ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమా ఎలాంటి మాస్ ఫీస్ట్ ఇవ్వనుందా అని నందమూరి అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్పటికే వీరి కాంబినేషన్‌పై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇదిలా ఉండగా, ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు బాలయ్య అండ్ టీమ్ రెడీ అయ్యారు. సెప్టెంబర్ 6న ఈ చిత్రానికి సంబంధించి ఓ క్రేజీ అప్డేట్ రానుందని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. NBK111 చిత్రానికి సంబంధించి టైటిల్‌తో పాటు రిలీజ్ డేట్‌ను ఆ రోజున ప్రకటించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకేరోజు రెండు ట్రీట్స్ వస్తుండటంతో బాలయ్య ఫ్యాన్స్ ఆ రోజు కోసం ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాను డిసెంబర్ 24, 2026 న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని వారు భావిస్తున్నారట. అదే సమయంలో అక్కినేని నాగార్జున మైల్‌స్టోన్ చిత్రం కింగ్ 100 కూడా రిలీజ్‌కు వస్తుండటంతో బాక్సాఫీస్ దగ్గర బిగ్ క్లాష్ ఖాయంగా కనిపిస్తుంది. మరి సెప్టెంబర్ 6న NBK111 ఇవ్వబోయే ఆ అప్డేట్ ఏమిటో చూడాలి.





# కాల భైరవతో రిలేషన్..!

టాలీవుడ్‌లో మరో సెలబ్రిటీ జంట తమ రిలేషన్‌పై క్లారిటీ ఇచ్చారు. 'బలగం' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి కావ్య కళ్యాణ్‌రామ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి తనయుడు, మ్యూజిక్ డైరెక్టర్ కాలభైరవతో తన రిలేషన్‌షిప్‌ను అఫీషియల్‌గా ధృవీకరించింది. గత కొన్ని రోజులుగా వీరిద్దరి ప్రేమపై వస్తున్న వార్తలకు ముగింపు పలుకుతూ, కావ్య కాలభైరవతో కలిసి ఉన్న బ్యూటీఫుల్ పిక్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. తన జీవితంలోకి కాలభైరవ వచ్చిన తర్వాత ప్రతి క్షణం ఎంతో ప్రత్యేకంగా మారిందంటూ ఒక ఎమోషనల్ నోట్‌ను ఆ పోస్ట్‌కు జోడించింది. కావ్య చేసిన ఈ స్పెషల్ పోస్ట్‌కి సినీ ఇండస్ట్రీలోని సహచరులు, స్నేహితులు మరియు అభిమానుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వీరిద్దరూ తమ బంధాన్ని బహిరంగంగా ప్రకటించడంతో టాలీవుడ్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రమంలో వీరి ప్రయాణం తర్వాతి దశకు ఎప్పుడు చేరుకుంటుంది, అలాగే త్వరలోనే పెళ్లికి సంబంధించిన అధికారిక ప్రకటన ఏమైనా వెలువడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.








## పుట్టినరోజు కానుక కోసం

# పవన్ ఫ్యాన్స్ ?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన కెరీర్‌లో మొదటిసారిగా ఒక సీక్వెల్ చిత్రంలో నటించబోతున్నారు, అదే 'ఓజీ 2' (OG 2). ఈ సినిమాకు కూడా సుజీత్ దర్శకత్వం వహించనున్నారు. మొదటి భాగం సృష్టించిన ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐతే, సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు కావడంతో, ఈ సీక్వెల్ కి సంబంధించిన ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఏదో ఆసక్తికరమైన విషయం ప్లాన్ చేస్తున్నట్లు తమన్ ఇప్పటికే పలుమార్లు సంకేతాలు ఇచ్చారు. దీనికితోడు పవన్ పుట్టినరోజు కానుకగా ఒక యానిమేటెడ్ వీడియోను విడుదల చేయవచ్చని గతంలో వార్తలు వచ్చాయి. అయితే, చిత్ర బృందం అసలు ఏం ప్లాన్ చేసిందనేది ఇంకా వెల్లడించలేదు, దీంతో అభిమానులు ఆసక్తితో ఎదురుచూస్తూనే అధికారిక ప్రకటన కోసం వేచి ఉన్నారు. ఈ సీక్వెల్ ను 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' నిర్మిస్తుండగా, మిగిలిన నటీనటులు మరియు సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాలు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

టాలీవుడ్‌లో తెరకెక్కిన లేటెస్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'రోమాంచకం' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి డైరెక్ట్ చేసిన ఈ సినిమాను బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ప్రణయ్ రెడ్డి ప్రొడ్యూస్ చేశారు. ఈ చిత్రం సెప్టెంబర్ 3న గ్రాండ్ రిలీజ్ కానున్న నేపథ్యంలో హీరోరయిన్ అనంతిక సనిల్ కుమార్ మీడియాతో ముచ్చటించారు. -'8 వసంతాలు' తర్వాత చాలా కథలు విన్నా ఏవీ నన్ను అంతగా మెప్పించలేదు. కానీ 'రోమాంచకం' స్క్రిప్ట్ వినగానే చాలా హ్యాపీగా అనిపించింది. ఇందులో నేను అనుకున్నట్టే ఒక బబ్లీ, సరదా అమ్మాయి పాత్రలో నటించాను. యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యే ఈ చిత్రంలో ప్రేమతో పాటు మంచి హాస్యం, ఉత్కంఠ కూడా ఉంటాయి. ఈ సినిమాలో నేను తమిళ అమ్మాయిగా కనిపిస్తాను. నేటి తరం యువత జీవితాలకు అద్దంపట్టే కాంటెంపరరీ లవ్ స్టోరీ ఇది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను కూడా ఇది మెప్పిస్తుంది. సుమంత్ ప్రభాస్ ఎనర్జిటిక్ క్యారెక్టర్ చూస్తే, నా పాత్ర కూడా దానికి పోటీగా ఉంటుంది. మా ఇద్దరి మధ్య డైలాగ్స్ చాలా న్యాచురల్‌గా, ఎక్కడా ల్యాగ్ లేకుండా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతాయి. '8 వసంతాలు' లాంటి ఇంటెన్స్ డ్రామా తర్వాత నేను కోరుకున్న సరదా లవ్ స్టోరీ 'రోమాంచకం'. షూటింగ్ కూడా అంతే ఫన్‌గా సాగింది. దర్శకుడి క్లారిటీ, నా పాత్ర డిజైన్, మ్యూజికల్ డ్రామాగా ఈ కథకున్న స్కోప్ నచ్చి ఈ సినిమా చేశాను. ఈ సినిమాలో నటించేటప్పుడు నేను బాగా ఎంజాయ్ చేసిన సీన్స్ చాలా ఉన్నాయి. నా పర్‌ఫార్మెన్స్‌కు సందీప్ గారి నుంచి ప్రశంసలు కూడా దక్కాయి. హీరో సుమంత్ ప్రభాస్‌ను మొదటిసారి కలిసినప్పుడే మంచి ఫ్రెండ్‌షిప్ ఏర్పడింది. రిహార్సల్స్ వల్ల మా మధ్య ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ బాగా కుదిరింది. ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి గారు మొదట్లో కోపధారిగా అనిపించినా, ఆయన చాలా సరదా మనిషని తర్వాత అర్థమైంది. ప్రస్తుతం తమిళం, మలయాళం, తెలుగు భాషల్లో వచ్చే అవకాశాలను బట్టి సినిమాలు చేస్తున్నాను. ఎల్‌కేజీ నుంచే డాన్స్, ఫైట్స్ వంటి రకరకాల కళలు నేర్చుకోవడం వల్ల నటిగా నా ప్రతిభ మరింత మెరుగైంది. ఊరికే ఉండటం నాకు నచ్చదు. చిన్నప్పటి నుంచి నేను నేర్చుకున్న కళలే ఈ రోజు నటిగా నాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. 8 వసంతాలు సినిమాలో నాకు మంచి పేరొచ్చింది.

# రోమాంచకం యూత్ రిలేట్!



# యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్ 'సర్దార్ 2'

తమిళ హీరో కార్తీ, దర్శకుడు పి.ఎస్. మిత్రన్ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'సర్దార్ 2' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. బ్లాక్‌బస్టర్ స్పై థ్రిల్లర్ 'సర్దార్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ట్రైలర్ ఆకట్టుకునేలా కట్ చేశారు. కార్తీ వైవిధ్యమైన లుక్స్, పవర్‌ఫుల్ యాక్షన్ అండ్ డైలాగ్ డెలివరీ హైలైట్‌గా నిలిచాయి. పి.ఎస్. మిత్రన్ తన మేకింగ్ స్టైల్‌తో ఈసారి మరింత భారీ స్థాయిలో ఇంటర్నేషనల్ స్పెక్ట్రమ్‌లో కథను ఆవిష్కరించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ట్రైలర్‌లో వచ్చే విజువల్స్, ఉత్కంఠ రేకెత్తించే బీజీఎం మరియు హాలీవుడ్ రేంజ్ యాక్షన్ సీక్వెన్స్ థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తున్నాయి. ఇక విలన్‌గా ఎస్.జె. సూర్య ప్రెజెన్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. కార్తీ, ఎస్.జె. సూర్యల మధ్య మైండ్ గేమ్‌లు సినిమాకే హైలైట్‌గా నిలవనున్నాయి. ఓవరాల్‌గా 'సర్దార్ 2' ట్రైలర్ ప్రతి ఫ్రేమ్‌లోనూ మాస్, యాక్షన్ ప్యాక్డ్ ఎలిమెంట్స్‌తో థియేటర్లలో సీట్ ఎడ్జ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోందని స్పష్టం చేస్తోంది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటించగా సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 10న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com